క్లుప్తంగా

నేటి నుంచి వేంకటేశ్వరుని ఆలయ వార్షికోత్సవం

బోట్‌క్లబ్‌: స్థానిక జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి 14వ తేదీ వరకూ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ సత్యవాణి గురువారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 7న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి పంచామృతాభిషేకాలు, 8న ఉదయం ఆర్జిత సేవలు, అగ్ని ప్రతిష్ఠాపన, హోమాలు, సాయంత్రం 7 గంటలకు స్వామివారి దివ్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. 9న శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 10న సదస్యం, 11న రథోత్సవం, 12న పూర్ణాహుతి, 13న పుష్పయాగం, 14న తెప్పోత్సవం వైభవంగా జరుగుతాయన్నారు. ఈ నెల 23న అన్నదానం ఉంటుందని తెలిపారు.

మామిడి మొక్కల పంపిణీ

కరప: పాతర్లగడ్డ గ్రామంలో బండారు లక్ష్మణరావు తన తల్లి జ్ఞాపకార్థం వినూత్నరీతిలో మామిడి మొక్కలు అందజేసి, అందరికీ ఆదర్శంగా నిలిచారు. పాతర్లగడ్డ గ్రామానికి చెందిన బండారు బాబూరావు భార్య చిన్న అమ్ములు ఇటీవల మరణించారు. గురువారం జరిగిన దశ దిన కార్యక్రమంలో పాల్గొన్న 250 మందికి ఒక్కొక్కరికి ఒక్కో మామిడి మొక్కను లక్ష్మణరావు అందజేశారు. సాధారణంగా ఎవరైనా కాలంచేసినప్పుడు, వారిజ్ఞాపకార్థం కుటుంబసభ్యులు స్టీలు లేదా రాగి పాత్రలు అందజేయడం పరిపాటి. లక్ష్మణరావు కొత్తతరహాలో మామిడిమొక్కను ఇవ్వడంపై గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తంచేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

కాకినాడ క్రైం: భార్య అదృశ్యంపై ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. కాకినాడ కొమరపేట ఏసు వారి వీధికి చెందిన మొండు శ్రీధర్ తన భార్య లావణ్య గత ఏడాది డిసెంబర్ 4వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లిందని, అప్పటి నుంచి తిరిగి రాలేదు. బంధువులు స్నేహితుల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకపోయే సరికి పోలీసులను ఆశ్రయించినట్టు తెలిపాడు. చేవూరి రాజశేఖర్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్న నేపథ్యంలో అతడితో వెళ్లిందని అనుమానిస్తున్నట్టు భర్త శ్రీధర్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ రూరల్: వార్షిక మరమ్మతుల కారణంగా 33/11కేవీ సర్పవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఉదయ్ భాస్కర్ తెలియజేశారు. ఆశ్రమం స్కూల్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలు ఏపీఐఐసీ కాలనీ, మురళీధర్ నగర్, పోలీసుస్టేషన్ ఎదురుగా, సర్పవరం జంక్షన్, స్పెన్సర్స్ ఏరియా, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ ఏరియా, బోట్‌క్లబ్ ఎదురుగా, వేగుల పాపయ్య స్ట్రీట్, ఆశ్రమం స్కూల్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొవ్వూరులో అడిషనల్ ఎస్పీ పర్యటన


కమిటీ సభ్యులతో మాట్లాతున్న అడిషనల్ ఎస్పీ పాటిల్ దేవరాజు మనీష్, సీఐ చైతన్య కృష్ణ, ఎస్సై వీరబాబు

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వూరు గ్రామంలో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా రాత్రి పూట జరుగనున్న జాతరలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించవద్దని నిర్వాహకులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. కొవ్వూరు గ్రామాన్ని గురువారం రాత్రి అడిషనల్ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, రూరల్ సీఐ చైతన్య కృష్ణ, ఇంద్రపాలెం ఎస్సై ఎం.వీరబాబు తదితరులు సందర్శించారు. ప్రశాంత వాతావరణంలో జాతరను నిర్వహించుకోవాలన్నారు. జాతర సందర్భంగా అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యక్రమాలను నిర్వహించవద్దని అడిషనల్ ఎస్పీ సూచించారు.

వ్యర్థాలతో అద్భుతాల ఆవిష్కరణ

నాగమల్లితోట జంక్షన్: స్థానిక సురేష్‌నగర్ శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో సీతానరసింహ క్షేత్రంలో శ్రీప్రకాష్ విద్యాసంస్థలు కాకినాడ, పెద్దాపురం శాఖలు సంయుక్తంగా నిర్వహించే హరివిల్లు కార్యక్రమం రెండో రోజు సందర్శకులతో కళకళలాడింది. హరివిల్లు ఆర్ట్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌లో విద్యార్థులు రూపొందించిన అనేక ఆకృతులు వాటిని తయారు చేసిన విధానం ఆకట్టుకున్నాయి. రెండో రోజు హరివిల్లు కార్యక్రమాన్ని సందర్శించడానికి తిరుపతికి చెందిన ప్రముఖ పర్యావరణ వేత్త, తిరుపతి నగరంలో ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా పోరును సాగిస్తున్న పాలేటి శివాజీ హాజరయ్యారు. ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన చిత్రాలను, కళాఖండాలను చూసి, విద్యార్థులు వాటిని మలచడానికి పడిన శ్రమకు, వ్యర్థాలతో అద్భుతాలను ఆవిష్కరించవచ్చు అన్న వారి ఆలోచనా సరళికి సంబరపడ్డారు. ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్న నగర ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీప్రకాష్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ సిబ్బందిని అభినందించారు.


చూపరులను ఆకట్టుకుంటున్న అంజీర మొక్క


రమణారావు ఇంటి ముందు ఆకర్షణీయంగా మొక్కల కుండీలు


కాయలు కోయడానికి సిద్ధంగా ఉన్న దేశవాళి చిక్కుడు


స్టార్ ఫ్రూట్ మొక్క

ఆహ్లాదం.. ఆరోగ్యం..

- మిద్దె పంటలపై ఆసక్తి చూపుతున్న నగర వాసులు
- డాబాలపై ఆకర్షణీయంగా మొక్కల పెంపకం
- పూలు, పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): కాస్తో కూస్తో వ్యవసాయంపై అవగాహన ఉన్నవారు మాత్రమే పట్టణ ప్రాంతాల్లో మేడలపై పలు రకాల మొక్కలు పెంచడం వంటివి చేసేవారు. ఆ తర్వాత రకరకాల కాయగూరలు, ఆకుకూరలు వంటివి పెంచుకునేవారు. కానీ ఇప్పుడు మిద్దె పంటలపై పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందుకు వేలకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దీంతో ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం లభిస్తుందని చెబుతున్నారు. కాకినాడ నగర వాసులు మిద్దెసాగుపై మొగ్గు చూపుతున్నారు. పర్యావరణంతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో మొక్కల సంరక్షణ వైపు మళ్లుతున్నారు. దీని కోసం ఇంటి ఆవరణను సాగు క్షేత్రంగా మార్చుస్తున్నారు. పచ్చదనం పెంచే మొక్కలతో పాటు పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు పెంచుతున్నారు. ఇళ్లను నందన వనాలుగా మార్చుతున్నారు. పూలసాయం చూసి సంబరపడుతున్నారు.


కొవ్వాడలో తన్వీర్ జహ ఇంటి మిద్దె నిర్వహిస్తున్న టెర్రస్ గార్డెన్

కాకినాడ నగరంలో రామారావుపేట, గాంధీనగర్, మధురానగర్, ఇంద్రపాలెం, కొవ్వాడ, రేచర్లపేట, సాంబమూర్తి నగర్, శ్రీనగర్, గైగోలుపాటు, అచ్చుతాపురం, ట్రజరీ కాలనీ, సురేష్ నగర్ తదితర ప్రాంతాల్లో పలువురు రిటైర్ట్ ఉద్యోగులు, గృహిణులు, ఉద్యోగులు మిద్దె పంటలను పండిస్తున్నారు.

ఆకర్షణీయంగా ఫ్రేమ్‌లు

మొక్కలు పెంచడానికి ఫ్రేమ్‌లు ఆకర్షణీయంగా తయారు చేసి వాటిలో కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. ఇవి చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

ప్రవృత్తిగా మొక్కల పెంపకం



కొవ్వాడ గ్రామంలో తన్వీర్ జహ ఆమె ప్రైవేట్ టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. క్రోటన్స్, పూలమొక్కలు, కూరగాయల మొక్కలు పెంచడం అలవాటు. రాను రాను వాటిని అందంగా తర్చిదిద్దే ఏర్పాటు చేశారు. ఇందుకోసం వేల రూపాయలు ఖర్చు చేశారు. మొక్కలు అందంగా పెరుగుతుంటే ఆ ఖర్చు తెలియలేదని, హ్యాంగింగ్ క్రోటన్స్, కోకోప్లమ్, మిష్‌వాష, దాల్చిన చెక్క, డ్రాగన్, అంజీర, కాకర, నేరేడు వంటి అరుదైన మొక్కలు కూడా పెంచుతున్నారు.

– తన్వీర్ జహ, కొవ్వాడ, కాకినాడ

మిద్దె పంటల సంతృప్తి



మాది నెల్లూరు జిల్లా. కాకినాడ రేచర్లపేటలో నివాసముంటున్నాం. చిన్న తనం నుంచి వ్యవసాయం అంటే ఇష్టం. చిన్నతనంలో నాన్నతో పొలానికి వెళ్లేవాడిని. మొక్కలపై ఉన్న అభిరుచితో మిద్దె పంటల సాగుచేస్తున్నాను. నిత్యం బిజీగా ఉన్నా దీన్నే వ్యాపకంగా మార్చుకున్నాను. మిత్రులు అందించిన మొక్కలు సేంద్రియ ఎరువులతో సంరక్షిస్తున్నాను. అందుకే ఇవి బాగా ఏపుగా పెరుగుతున్నాయి. మామిడి, తైవాన్ జామ, కేజీ జామ వంటి మొక్కలు ఫలాలు ఇస్తున్నాయి. ఇది ఎంతో సంతోషాన్ని ఇస్తోంది.

– రమణారావు, రేచర్లపేట, కాకినాడ

కలెక్టర్‌ను కలిసిన ఇసుజు మోటార్స్ ఎండీ


కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన రాజేష్ మిట్టల్, బృందం సభ్యులు

కాకినాడ సిటీ: ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్, వారి టీమ్ సభ్యులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ సగిలిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పరస్పరం మాట్లాడుకున్నారు. ముందుగా రాజేష్ మిట్టల్ గ్రూప్ సభ్యులు గవర్నమెంట్ ఐటీఐ, వివిధ కళాశాలలను సందర్శించారు. ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తరఫున ఆటోమేటివ్ టెక్నాలజీకి సంబంధించిన ఇంజన్ కట్ సెక్షన్‌ను విద్యార్థులకు సాంకేతిక అవగాహన కల్పించి మెరుగైన ఉపాధి అవకాశాలు సంపాదించుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలుకల మందు పంపిణీ

కరప: మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం వ్యవసాయశాఖ ద్వారా రైతులకు ఉచితంగా ఎలుకల మందు పంపిణీ చేయనున్నట్టు ఎంఏఓ ఏవీ రాజేష్ తెలిపారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతులందరూ తమ గ్రామాల్లో సామూహికంగా ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పెనుగుదురు రైతు సేవా కేంద్రంలో కరప సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాబూరావు రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తారన్నారు.

బీచ్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి


బీచ్‌లో పర్యాటకంగా అభివృద్ధిపై అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

- కలెక్టర్ షణ్మోహన్
- అధికారులతో బీచ్‌ను సందర్శించిన కలెక్టర్

కాకినాడ రూరల్: పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా బీచ్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. మండలంలోని సూర్యారావుపేటలో బీచ్‌ను గురువారం ఉదయం రెవెన్యూ, పంచాయతీ, జిల్లా పరిషత్, కౌడా, పర్యాటక, ఇతర శాఖల ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. బీచ్‌లో క్లీనింగ్, భవిష్యత్‌లో చేపట్టబోయే నూతన ప్రాజెక్టుల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీచ్‌కు వచ్చే సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీచ్ పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు చేపట్టబోయే నూతన ప్రాజెక్టుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఆర్డీఓ మల్లిబాబు, తహసీల్దార్ కుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ హెచ్‌వోడీకి జీవన సాఫల్య పురస్కారం


తమిళిసై చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న ఉమామహేశ్వరావు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ పోతుల ఉమామహేశ్వరరావును జీవన సాఫల్య పురస్కారం వరించింది. తమిళనాడు రాజధాని చెన్నైలో జరిగిన 46వ వార్షిక జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళిసై చేతుల మీదిగా డాక్టర్ ఉమామహేశ్వరరావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఇండియన్ అకాడమీ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ ఆధ్వర్యంలో. ఫోరెన్సిక్ మెడికోన్–2025 పేరుతో జరిగిన ఈ సదస్సులో ఫోరెన్సిక్ విభాగానికి విశేష సేవలందించిన విభాగాధిపతులను పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ విభాగంలో రాష్ట్రం నుంచి డాక్టర్ ఉమామహేశ్వరరావు ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్‌లు డాక్టర్ ఉమామహేశ్వరరావు ఘనతను కొనియాడారు. ఆర్ఎంసీ ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ తరఫున అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణికిరణ్ బృందం హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపింది.

ఢిల్లీలో ఏఎస్‌డీ విద్యార్థుల ప్రతిభ


ఢిల్లీలో ప్రతిభ కనబరిచిన ఏఎస్‌డీ విద్యార్థులు

బాలాజీచెరువు: స్థానిక జగన్నాథపురం ఏఎస్‌డీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శిరీష, ఎస్.సురజాక్షి జనవరి 14వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించి ఎస్ఎన్‌వీసీ ఢిల్లీ (పీఎం ర్యాలీ)లో ఒకే పాటకు 900 మంది నృత్యం చేస్తూ 12 ఎన్‌సీసీ డైరెక్టరేట్స్ 2 నిమిషాల్లో 12 రాష్ట్రాల సాంప్రదాయ నృత్యాలను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లంబాడా నృత్యాన్ని ప్రదర్శిస్తూ లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పాల్గొని వరల్డ్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ హౌస్‌లో వారి నృత్యాన్ని మరొక్క సారి ప్రదర్శించారు. గవర్నర్ చేతుల మీదుగా మెమెంటోను అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఏపీ అండ్ టీని ఎన్‌వో కెప్టెన్ డాక్టర్ ఎ.ప్రమీల రాణి సారథ్యం వహించారు. వారిని ఢిల్లీ తెలంగాణ తీసుకువెళ్లి తీసుకువచ్చిన సందర్భంలో కేండిట్లను అభినందిస్తూ కళాశాలలో చదువుతున్న వీరు ప్రధాన మంత్రి పెరేడ్‌లో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ను కలిసి రాష్ట్రానికి, జిల్లాకు ఎన్‌సీసీ యూనిట్‌కు కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చినందుకు విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సువర్చల, ఫిజికల్ డైరెక్టర్ కెప్టెన్ డాక్టర్ ఎ.ప్రమీల రాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వసంతలక్ష్మి, జీసీ కోఆర్డినేటర్ ఎ.అనితా, జేకేసీ కో–ఆర్డినేటర్ పి.సంజోత అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

రాఘవేంద్రస్వామి వార్షికోత్సవం


పత్రికను ఆవిష్కరిస్తున్న స్వామీజీ

బోట్‌క్లబ్: రాఘవేంద్ర స్వామి బృందావన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి 47వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు సమితి కోశాధికారి వై.వెంకటేష్ తెలిపారు. రాఘవేంద్రస్వామి బృందానంలో వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలను ఉడిపి శిరూర్ మఠాధిపతి వేద వర్ధన తీర్థ స్వామీజీ గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 19న ఉదయం సర్పదోష నివారణ, నాగపూజ పేరిట ఆశ్లేష బలి ప్రత్యేక పూజ జరుగుతుందన్నారు. 20న తులాభార సేవ, గణపతి హోమం, పుణ్యాహవచనం, కనకాభిషేం తదితర సేవలు చేయనున్నట్టు తెలిపారు. 21న గోమూల్యదానం, కలశాభిషేకం, 22న రాఘవేంద్రస్వామి ఉత్సవ మూర్తులతో నగర వీధుల్లో రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ మధ్వసభ కమిటీ కోశాధికారి వేముగంటి రాము, మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్, సభ్యులు రాచూరి రామకృష్ణ, భగీరథ శర్మ, సత్తిరాజు, ఎస్.అనంతరామారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో ఫ్యామిలీ కౌన్సెలింగ్


ఫ్యామిలీ కౌన్సింగ్ కార్యక్రమంలో నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కాకినాడ ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ అవేర్నెస్ ప్రోగ్రామ్‌ను కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఆర్టీవో శివారెడ్డి, మెడికల్ అధికారి పద్మావతి, ఎంవీ హరినాథ రెడ్డి, ఏఎంవీఐ సాయిబాబు, డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకర రావు, టి.బాలకృష్ణ పాల్గొని డ్రైవర్లు, కండక్టర్ల ఫ్యామిలీలను ఉద్దేశించి మాట్లాడారు. డ్రైవర్లు బస్సులు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలను అరికట్టాల్సిన నైపుణ్యాలను వివరించారు. యాక్సిడెంట్ అయిన డ్రైవర్ల కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం

కరప: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం వారు స్థానిక నాయకులతో కలిసి కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.

రిక్షా కార్మికుడి మృతిపై కేసు

కాకినాడ క్రైం: కాకినాడలో రిక్షా కార్మికుడు పుల్లర్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ మాధవనగర్‌కు చెందిన బొద్దన పైడయ్య(54) రిక్షా కార్మికుడిగా జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం నగరంలోని అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలో రిక్షాలో అచేతనంగా పడి ఉన్నాడు. స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒంటిపైన గాయాలున్నాయని మృతుడి కుమారుడు అచ్చారావు అనుమానం వ్యక్తం చేయడంతో కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తించాలి

డ్వామా ఏపీడీ వసంత మాధవి


కరపలో ఉపాధి పనులపై సమీక్షిస్తున్న ఏపీడీ వసంత మాధవి

కరప: ఎప్పుడూ చేసే పనులు కాకుండా గ్రామాల్లో ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలని డ్వామా ఏపీడీ పి.వసంత మాధవి సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం పనులపై పలు సూచనలిచ్చారు. కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు పనులే కాకుండా కొత్తరకం పనులు గుర్తించాలన్నారు. మండల పరిధిలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, ఆయా గ్రామాల్లో వేతనదారులందరికీ పని కల్పించాలన్నారు. లేబర్ రిపోర్టు చూసి, ప్రస్తుతం రోజుకు 800 నుంచి వెయ్యిమందే పని చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 3 వేల మందికి తక్కువ కాకుండా పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ రుణాలు తీసుకున్న లబ్ధిదారులకు మార్చి నెలాఖరు నాటికి 90 పని దినాలు పూర్తి చేయించి, వేతనాలు చెల్లించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఏపీడీ వసంతమాధవి కోరారు. ఏపీఓ జీవీ రమణకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు టి.రాజేందర్, కేజే ప్రకాష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: కార్మిక శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరు జిల్లాలో కార్మికుల సమస్యలపై కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులతో జిల్లా లేబర్ కమిషనర్ పి.శ్రీనివాస్ జాయింట్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. పరిశ్రమలలో పెరుగుతున్న వలస కార్మికుల ప్రభావాన్ని తగ్గించి స్థానికులకు ఉపాధి కల్పించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. లేబర్ కోడ్లు అమలులోకి వస్తే జిల్లాలో భారీ పరిశ్రమలు సైతం కార్మిక చట్టాల నుంచి మినహాయిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు రెగ్యులర్ ప్రాతిపదించిన సేఫ్టీ చెకింగ్‌లు చేయాలని కోరారు. జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడ్డాయని వాటిని ప్రభుత్వమే తెరిపించి, ఉపాధిని కాపాడాలని కోరారు. జీజీహెచ్‌లో పని చేసే మెస్, శానిటేషన్ కార్మికులకు గత కాంట్రాక్టర్ చెల్లించాల్సిన పీఎఫ్ బకాయిలపై చర్చించారు. ఈ సందర్భంగా డీసీఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అసంఘటిత కార్మికులందరితో ఈశ్రమ నమోదు చేయించాలని కార్మిక సంఘాల ప్రతినిధులను కోరారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, తమ పరిధి కాని సమస్యలను ఆయా డిపార్టుమెంట్లకు అందజేస్తామని డీసీఎల్ శ్రీనివాస్ కార్మిక సంఘాల ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, మేడిశెట్టి వెంకటరమణ, తాళ్లూరి రాజు, వీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : తెగిన మహిళ చెవి

కాకినాడ క్రైం: కాకినాడలో గురువారం రాత్రి ఓ ఆటో బోల్తా పడిమహిళ చెవి తెగిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, కాకినాడ మెయిన్ రోడ్ నుంచి గురువారం రాత్రి ఓ ఆటో ముగ్గురు ప్రయాణికులతో బయలుదేరి జే రామారావు పేటకు వచ్చింది ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా ఉండడంతో బ్లూ కాన్వెంట్ సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో జగన్నాథపురానికి చెందిన 50 ఏళ్ల చింతా పార్వతి కుడి చెవి తెగి వేరుగా పడింది. బాధితురాలు పార్వతిని, ఘటనలో స్వల్ప గాయాలైన మరో ఇద్దరిని స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కాకినాడ వన్ టౌన్ పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు.

ఫైనల్స్‌కు ఐటా అండర్-16 టెన్నిస్ పోటీలు


డీఎస్‌ఏలో టెన్నిస్‌లో పోటీ పడుతున్న క్రీడాకారుడు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఏపీ లాన్ టెన్నిస్ సహకారంతో జిల్లా లాన్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏ టెన్నిస్ కోర్టులలో జరుగుతున్న అండర్–16 ఆల్‌ఇండియా ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు గురువారం ఫైనల్స్ దశకు చేరుకున్నాయి. సెమీ ఫైనల్స్‌లో బాలుర సింగిల్స్‌లో భువన్ (ఏపీ)పై ధ్రువ్(తమిళనాడు) 6–0,6–1, తనిష్ (తెలంగాణ)పై విన్సెంట్ (ఏపీ) 6–2, 6–3 స్కోర్‌తో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. భువన్ (తెలంగాణ)పై భువన్ (ఏపీ) 7–5, 6–1 స్కోర్‌తోడాతో గెలుపొందారు. బాలికల విభాగంలో జోషిత (ఏపీ)పై గౌరిశ్రీ (తెలంగాణ) 6–4, 5–7, 6–4 స్కోర్ తేడాతో, సవర్ణిక (తెలంగాణ)పై జోహ (తెలంగాణ) 6–3, 6–4 స్కోర్‌తో విజయం సాధించి ఫైనల్స్‌కు అర్హత సాధించారు. గురువారం నిర్వహించిన మ్యాచ్‌లను డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్, డాక్టర్ శేషగిరి, టిక్కు తిలకించగా, ఏపీ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్ కుమార్, టోర్నీ చీఫ్‌రిఫరీ శివకుమార్ పర్యవేక్షించారు.

స్టడీ మెటీరియల్ అందజేత


టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న చంద్రశేఖర్ తదితరులు

కాకినాడ రూరల్: స్థానిక శారద విద్యాలయం విద్యార్థులకు టెన్త్ ఎగ్జామ్ టార్గెట్ మెటీరియల్‌ను యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం అందజేసింది. పెనుమర్తి గ్రామంలోని సంకురాత్రి ఫౌండేషన్ కిరణ్ కంటి ఆసుపత్రికి చెంది శారదా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు ఈ మెటీరియల్‌ను పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యంగ్ మైండ్స్ ఫౌండర్ వాకాడ వెంకటరమణ చిన్న మాస్టర్ మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా ఈ పాఠశాలను, పేద విద్యార్థుల కోసం నడుపుతున్న డాక్టర్ చంద్రశేఖరని అభినందించారు. రావు, రాజేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ నూకరాజు, ఉపాధ్యాయులు, ఎండీ కరీం, కుమార్, రామకృష్ణ, యంగ్ మైండ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.